క్లుప్తంగా

పంటల సాగులో సూచనలు పాటించాలి

శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప



రైతులతో శాస్త్రవేత్తలు మహదేవప్ప, రమేశ్

మొయినాబాద్‌రూరల్: రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మహదేవప్ప, మండల వ్యవసాయ అధికారి అనురాధరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేల సారవంతంగా ఉంటే పంటలకు మంచి దిగుబడి వస్తుందన్నారు. పచ్చిరొట్ట పైర్ల పెంపకం, నేల ఆరోగ్యాన్ని కాపాడడం, వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. పంటల సాగులో రైతులు అధికారుల సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్, సునీల్, మానసరెడ్డి, అమూల్య, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకుందాం

మొయినాబాద్‌రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం చేవెళ్ల నియోజకవర్గ నూతన అధ్యక్షుడు చేగూరి రాజు అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. టీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యదర్శిగా గోదావరి జయచంద్ర, కోశాధికారిగా ఏర్పుల ఆనంద్, ఉపాధ్యక్షులుగా ఆసన్నగారి మహేశ్, మనిమద్రి మురళీ, జూకంటి నరేందర్, సహాయ కార్యదర్శులుగా కర్రోళ్ల శ్రీధర్, జగదీశ్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా శివగళ్ల శేఖర్, జిల్లా ప్రతిపాదకులు రఘునందన్‌గౌడ్, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రమేశ్‌ను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేయండి

చేవెళ్ల: వరంగల్‌లో ఈ నెల 31న జరిగే ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఊరెంట ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. చేవెళ్లలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకొని నేరుగా వరంగల్‌లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు 31న వరంగల్‌లో పెద్దఎత్తున స్వాగతం చెప్పడంతో పాటు జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో రావాలని కోరారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న సీఐ కాంతారెడ్డి, మాస్టర్ నర్సింలు

షాబాద్: కరాటే పోటీల్లో విద్యార్థులు తమ సత్తాచాటారని సీఐ కాంతారెడ్డి, కరాటే మాస్టర్ నర్సింలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఆర్ఆర్ స్టేడియంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 15 మంది విద్యార్థులు గ్రేడింగ్ ఉత్తీర్ణత సాధించి డబుల్ ప్రమోషన్, ఎల్లో జూనియర్ రెడ్ బెల్ట్ పొందారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపుల నుంచి బాలికలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే శిక్షణ అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రవి, రవీందర్ తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మాడ్గుల: మండలంలోని ఫకీరతండా గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, చందు, జాను, నరేందర్, రాజు, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎర.. మోసపోకు జర!

- నకిలీ విత్తనాలు, పురుగు మందులతో జాగ్రత్త
- గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- అప్రమత్తంగా ఉండకపోతే మోసపోక తప్పదు
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



మండలంలో ఫర్టిలైజర్ దుకాణంలో సిద్ధంగా ఉన్న పురుగుమందులు

కేశంపేట: వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే రైతులు ముందస్తుగా విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో గుర్తింపు లేని విత్తనాలు పుట్టగొడుగుల్లా వస్తున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే వాడాలని, నకిలీలను అరికట్టేందుకు విత్తన ప్యాకెట్లపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం పొందుపర్చిన వివరాలను సరిచూసుకొని కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

అధికారుల సూచనలు.. ఎంతో మేలు

ఖరీఫ్ సాగుకు రైతులు కోటి ఆశలతో సిద్ధం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు సమకూర్చుకోవాల్సిన కీలక సమయం ఇది. మార్కెట్‌లో విత్తనాలు, పురుగు మందుల ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలతో ఆయా కంపెనీలు రైతులను ఊరిస్తున్నాయి. విత్తనం ఎంపికలో నకిలీది అయితే విత్తనంమొలకెత్తకపోవడం, ఎరువులు నాణ్యత లేకపోయినా రైతుకు అప్పులు మిగులుతాయి. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం ఉత్తమం. ఇప్పటికే గ్రామాల్లో పలు రకాల కంపెనీల వారు విత్తనాలు, పురుగుమందుల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీల ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎరువులైనా, విత్తనాలైనా ఈ సమయంలో ఆలోచించి వ్యవసాయ అధికారుల సూచనలతో కొనుగోలు చేయడం ఎంతో మేలు. విత్తనాలు కొనుగోలు చేసేముందు రైతులు ఆయా గ్రామాలకు సంబంధించిన క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. వారిని సంప్రదించి సూచనాలు, సలహాలను తీసుకోవచ్చు.

మండలంలో..

మొక్కజొన్న, పత్తి, వరి, కందులు ఎక్కువ మొత్తంలో సాగుచేసే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని 29 గ్రామాల పరిధిలో 46 వేల ఎకరాల భూమి సాగు భూమి ఉంది. అందులో సుమారుగా 15 వేల ఎకరాల్లో పత్తి, 12వేల ఎకరాల వరకు మొక్కజొన్న, 10వేల ఎకరాల్లో వరి, 2వేల ఎకరాల వరకు కందులను సాగుచేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

రసీదులు తీసుకోవాలి



రైతులు గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులను తీసుకోవాలి. అధిక ధరలకు నకిలీ విత్తనాలను, పురుగు మందులను కొనుగోలు చేసి మోసపోవద్దు.

– వినయ్, ఏఈఓ

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



వానాకాలం సమీపిస్తుండడంతో రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అటువంటి వారి లైసెన్స్ రద్దుచేసి షాపులను సీజ్ చేస్తాం. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలి. విత్తన ప్యాకెట్లు, పురుగుమందు డబ్బాలపై తయారీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాలి. కాలం చెల్లిన విత్తనాలు, మందులను అమ్మితే చర్యలు తీసుకుంటాం.

– శిరీష, ఏఓ



మరియాపూరంలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళా కూలీలు

సాగుబాటలో రైతన్న

- ఖరీఫ్ సాగుకు సమాయత్తం
- పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

షాబాద్: ఈ ఏడాది తొలకరి వానలు ముందే కురవడంతో రైతులు సాగుబాట పట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఈ ఏడాది వేసవిలోనే వర్షాలు పడడంతో రైతులు ముందుగానే దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్నారు. మరి కొందరు రైతులు చెరువుమట్టి, పశువులు, కోడి ఎరువు చేలకు వేసుకొని ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. కొందరు పొడి దుక్కిలోనే పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటగా.. తొలకరి వానలు కురవడంతో మండలంలోని మరియాపూరం, అంతారం, కుర్వగూడ, కేసారం, బోడంపహాడ్, మన్మర్రి గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోహిణి కార్తెలో విత్తనాలు నాటితే మంచి దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ సారి ముందుగానే పాఠ్య పుస్తకాలు అందనున్నాయి. పాఠశాలలు తెరవడానికి ఇంకా పదిహేను రోజుల సమయం ఉండగానే మండల వనరుల కేంద్రాలకు చేరిన పాఠ్యపుస్తకాలను బడులకు చేరవేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 25,675ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటికే 21,843ల పాఠ్యపుస్తకాలు మండల వనరుల కేంద్రానికి వచ్చాయి. అన్ని తరగతుల్లోని దాదాపు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి మల్లయ్య తెలిపారు. 6వ తరగతి గణిత శాస్త్రం, 6, 7, 8వ తరగతుల హిందీ పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. మండల వనరుల కేంద్రానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను బుధవారం కొన్ని పాఠశాలలకు ఆటోల్లో చేరవేశారు.



మండల వనరుల కేంద్రంలో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మల్లయ్య



మొయినాబాద్‌లో కల్వర్టు మూసివేయడంతో రోడ్డుపై నిలిచిన వరదనీరు(ఫైల్)

వరద నీటికి దారేది..?

- కల్వర్టులు మూసివేయడంతో రోడ్డుపైనే నిలుస్తున్న వర్షపునీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు

మొయినాబాద్: నీరు పల్లమెరుగు.. ఇది నగ్న సత్యం. మరి నీరు వెళ్లే దారులనే మూసివేస్తే ఎటు పోతుంది. ఎక్కడ లోతట్టు ప్రాంతం ఉంటే అక్కడికి వెళ్తుంది. మొయినాబాద్ మున్సిపాలిటీలో అదే జరుగుతుంది. రహదారుల కింది నుంచి వరద నీరు వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టులను మూసివేయడంతో ఆ నీరు రోడ్లపైనే నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తోంది. మున్సిపల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏ వన్ మోటార్స్ వద్ద హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షం పడినప్పుడు భారీగా వరదనీరు నిలుస్తోంది. రోడ్డు లోతట్టుగా ఉండటంతో రెండు వైపులా నుంచి వరదనీరు అక్కడికే వచ్చి చేరుతోంది. వాస్తవానికి ఆ ప్రాంతంలో గతంలో కల్వర్టు ఉండేది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాట్ల యజమానులు కల్వర్టును పూర్తిగా మూసివేశారు. దీంతో వర్షపునీరు వెళ్లేందుకు దారిలేక అక్కడే నిలుస్తున్నాయి. అదేవిధంగా హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ చౌరస్తాల సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టులను మూసివేశారు. వర్షపునీరు వెళ్లకుండా నిర్మాణాలు చేపట్టారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నడుములోతు నీళ్లు నిలిచాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై వర్షపునీరు నిల్వకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని మూడు నెలల ముందే నేషనల్ హైవే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు పర్యటించి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపునీరు వెళ్లే కల్వర్టులను పునరుద్ధరించి రోడ్డుపై నీళ్లు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



షాబాద్: హైతాబాద్‌లో ఇందిరమ్మ ఇంటి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అంతారం, షాబాద్, సంకెపల్లిగూడ, నాగర్‌కుంట, హైతాబాద్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం సంతోషకరమని, ఈ పథకాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, డిప్యూటీ తహసీల్దార్ మధు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, సంజీవరెడ్డి, అక్తర్‌పాషా, నర్సింహులుగౌడ్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, పార్టీ సీనియర్ నాయకులు రవీందర్, వెంకటయ్య, రాహుల్‌గుప్తా, స్వామి, రాజు, చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, నరేందర్‌రెడ్డి, రవీందర్ నాయక్, మహేందర్‌గౌడ్, ఆంజనేయులు, జనార్దన్ రెడ్డి, ఖాజామీయా తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలతో ఎంతో మేలు

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరుగుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గు: చౌదరిగూడలో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వాచ్యతండా, మల్కపహాడ్‌తండా, హేమ్లాతండా, లోక్యాతండా, రుకాలితండా, చింతకుంటతండా, జిల్లేడ్ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మల్కపహాడ్‌తండాకు చెందిన శివమ్మ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కొత్తూరు: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం, సీసీరోడ్లు, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా నిజమైన అర్హులకే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, రవికుమార్ గుప్తా, దేవేందర్‌ముదిరాజ్, శంకర్‌నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్, చాకలిదానిగుట్టతండా, తాటిగడ్డతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తాటిగడ్డతండాలో మురుగు కాల్వల నిర్మాణానికి, చాకలిదానిగుట్ట తండాలో సీసీరోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రేపు దేవాలయ భూములకు వేలం

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములకు కౌలు వేలం వేయనున్నట్టు ఆలయ ఈఓ రామశర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు 8 ఎకరాల 15 గుంటల వ్యవసాయ భూమికి రెండు సంవత్సరాలకు గాను కౌలు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన రైతులు వేలంలో 3 వేల రూపాయలను డిపాజిట్ చేసి పాల్గొనాలని ఆయన కోరారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు

కడ్తాల్: మండల పరిధి ముద్విన్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సహకారంతో బుధవారం గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యుడు మహేశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, మహేశ్, శ్రీశైలం, కృష్ణయ్య, రాములు, ఏఎన్ఎం పద్మ, అంగన్వాడీ టీచర్లు సునీత, హంసమ్మ, కిష్టమ్మ, ఆశ వర్కర్లు శ్యామలమ్మ, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు తగవు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ కార్మికులపై.. యాజమాన్యం వేధింపులు మానుకోవాలని ఐక్య జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో ఎదుట సంస్థ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులపై యాజమాన్యం పని భారం మోపుతున్నారని ఆరోపించారు. కిలోమీటర్లను పెంచి, అక్రమ చార్జిషీట్లు జారీ చేస్తుందని, కేఎంపీఎల్, ఈపీకే తేవాలని ఒత్తిడి తెస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వి.శ్రీనివాస్, కో–కన్వీనర్ జీఆర్ చందర్, పి.జంగయ్య, ఎండీ రజాక్, సత్తయ్య, సీహెచ్ పరమేశ్, మల్లేశ్, శ్రీశైలం, ప్రవీణ్, దర్శన్, యాదయ్య, వెంకటేశ్, సురేష్‌లు పాల్గొన్నారు.

కార్యాలయంలోకి వెళ్లేదెలా..?

కొందుర్గు: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షపునీరు నిలుస్తుండడంతో కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రజలు, సిబ్బందికి ఇబ్బందిగా మారుతోంది. కార్యాలయం గేటు నుంచి భవనం వరకు నీరు నిల్వడంతో లోపలికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రతినిత్యం కార్యాలయానికి పనులపై రైతులు, విద్యార్థులు, మహిళలు, రియల్ వ్యాపారులు వస్తుంటారు. వీరందరూ వర్షపునీటిలో నుంచి నడిచి కార్యాలయంలోకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపునీరు

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

తుర్కయంజాల్: రోడ్డును ఆక్రమించి, దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లి రోడ్డు, సాగర్ రహదారికి వరువైపులా దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన బోర్డులను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలను చేపట్టడం ట్రాఫిక్ జామ్‌కు కారణం అవుతున్నారని, ఏడాది క్రితం ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించడంతో కొన్ని రోజుల పాటు ఇబ్బంది లేకుండా ఉందని వివరించారు. తిరిగి రోడ్లను ఆక్రమించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయని కమిషనర్ పేర్కొన్నారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



చేవెళ్ల: మిర్జాగూడ గ్రామంలో లబ్ధిదారురాలికి మంజూరుపత్రం అందిస్తున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వం ఇళ్లు లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్ అన్నారు. మండలంలోని మిర్జాగూడ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా గ్రామ నాయకుల సమక్షంలో ఇంటి నిర్మాణాలకు ముగ్గుపోయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు కృషి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయడం జరుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, తోల్‌కట్ట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వారు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మానయ్య, నాయకులు నిరంజన్‌గౌడ్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

మొయినాబాద్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌తో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మాధవరెడ్డి, గణేష్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.